సాక్షి నిజామాబాద్


ఆదివారం । 9 । మార్చి । 2025



రాజీమార్గంలోనే..

భూతగాదాల కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల సూచించారు.

- 8లో ▸



గరిష్ఠం/కనిష్ఠం
38.8 /12.0

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి స్వల్పంగా మంచుకురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

నర్సింగ్ స్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన



ఎడపల్లి(బోధన్): ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ ఏర్పాటు కోసం మండలంలోని అంబం గేట్ వద్ద ఎన్‌ఎస్‌ఎఫ్ స్థలాన్ని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం పరిశీలించారు. రోడ్డు, రవాణా వసతి వంటి వాటికి అనువైన వాతావరణం ఉండడాన్ని గమనించిన కలెక్టర్, సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపించాలని స్థానిక అధికారులకు సూచించారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఈవో అశోక్, తహసీల్దార్ విఠల్, అధికారులు ఉన్నారు.

పసుపు రైతులకు నష్టం చేస్తే ఊరుకోబోం



మోర్తాడ్(బాల్కొండ): పసుపు ధరల విషయంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ పాలకవర్గం, వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులకు నష్టం కలిగిస్తున్నారని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునేది లేదన్నారు. మోర్తాడ్ మండలం పాలెంలో శనివారం పర్యటించిన ఆయన.. రైతులతో పసుపు ధర్పై చర్చించారు. మార్కెట్ పరిస్థితులపై జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో ఫోన్‌లో మాట్లాడారు. పసుపునకు కటాఫ్ ధరను రూ.9వేల నుంచి రూ.8వేలకు తగ్గించారని, కొమ్ముకు రూ.10వేలు, మండకు రూ.9వేలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. పసుపు బోర్డు ఏర్పాటు పేరుకే ఉందని, బోర్డు ఏర్పడితే రూ.15వేల మద్దతు ధరను చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు ఆందోళనకు గురికావొద్దని, అండగా ఉంటామన్నారు.

సిఖ్ సొసైటీ సేవలు ప్రశంసనీయం



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ సిఖ్ సొసైటీ సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. తెలంగాణ సిఖ్ సొసైటీ ఉమెన్ డెవలప్‌మెంట్ హబ్ శంకుస్థాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ పక్కన ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ హనుమంతు ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించగా, సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు, రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) తేజ్‌దీప్ కౌర్ పాల్గొన్నారు. అనంతరం పాములబస్తీలోని గురుద్వారాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనాల్లో వారు పాల్గొన్నారు. తెలంగాణ సిఖ్ సొసైటీ ఉమెన్ డెవలప్‌మెంట్ హబ్‌కు శంకుస్థాపన చేశారు. గురుద్వారాకు ఆనుకుని రేకుల షెడ్లలో నివాసాలు ఉంటున్న సిక్కు కుటుంబాల ఇళ్లను సందర్శించి వారి జీవన స్థితిగతులను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అర్హులైన వారికి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని రిటైర్డ్ డీజీపీ కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సొసైటీ ప్రతినిధులు దర్శన్ సింగ్, మహేందర్‌సింగ్, దీప్‌సింగ్, నరేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ చిరుత సంచారం

ఎడపల్లి(బోధన్): చిరుతపులి మళ్లీ సంచరిస్తోంది. జాన్కంపేట్ శివారులో రైస్‌మిల్ నిర్మాణ పనుల్లో భాగంగా పిల్లర్ల కోసం గురువారం తవ్వకాలు చేపట్టారు. అదే సమయంలో వచ్చిన చిరుత అరగంట వరకు అక్కడే కూర్చుంది. జేసీబీ డ్రైవర్ భయాందోళనతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. నెల రోజులుగా చిరుత సంచరిస్తోందని తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పుస్తకాల తోట

చైతన్యాన్ని రగిలించే కవిత్వాలు.. మహానుభావుల ఆత్మకథలు, జీవిత చరిత్రలు.. చరిత్రను కళ్ల ముందుంచే పుస్తకాలు, ప్రత్యేక సంచికలు.. అన్నీ ఒకే చోట. కదుపులో సల్ల కదలకుండా బడి పంతులు ఉద్యోగం చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ సాహిత్యంపై మక్కువతో జిల్లా కేంద్రానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కాసర్ల నరేశ్‌రావు తన ఇంటి పైఅంతస్తులో ప్రత్యేకంగా గ్రంథాలయాన్ని నెలకొల్పారు. 15 వేలకుపైగా పుస్తకాలను అందుబాటులో ఉంచి సాహితీలోకానికి తన సేవలందిస్తున్నారు. విద్యార్థులకు తెలుగు పాఠాలు బోధిస్తూనే కవిగా, రచయితగా తనదైన ముద్రవేస్తున్న నరేశ్‌రావు.. ఎంతో మంది విద్యార్థులను కవితా రచనలో తీర్చిదిద్దుతున్నారు.





పుస్తకాలను పరిశీలిస్తున్న ఔత్సాహిక విద్యార్థులు

ఆ ఇల్లే ఓ గ్రంథాలయం

- లైబ్రరీ కోసం ఇంటిపై ప్రత్యేక అంతస్తు నిర్మాణం
- 15 వేలకు పైగా పుస్తకాల సేకరణ
- సాహిత్యకారులు, పరిశోధక విద్యార్థులకోసం అందుబాటులో..
- అక్కడే కూర్చుని చదువుకునేందుకు వసతుల ఏర్పాటు
- సాహిత్య సేవలో తరిస్తున్న తెలుగు టీచర్ డాక్టర్ కాసర్ల

నిజామాబాద్ సిటీ : ఆ ఇంటి నుంచి వచ్చే సాహిత్య పరిమళాల సువాసన ఎన్నో మెదళ్లను కదిలిస్తోంది. తెలుగు పాఠాలు బోధించే పంతులు కవిగా, రచయితగా, గ్రంథకర్తగా రాణిస్తూ సాహిత్య లోకానికి తన సేవలందిస్తున్నారు. ఆయన పేరే డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు. ప్రస్తుతం సిర్పూర్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తన ఇంటి పైఅంతస్తును గ్రంథాలయంగా మార్చారు. 35 ఏళ్ల క్రితం పుస్తకాలు సేకరించడం ప్రారంభించిన ఆయన 15 వేల పుస్తకాలను అందుబాటులో ఉంచారు.

సాహిత్య దాహార్తిని తీరుస్తున్న లైబ్రరీ

సండే స్పెషల్

తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన సాహితీవేత్తల గ్రంథాలు, కావ్యాలు, పద్య కావ్యాలు, ప్రాచీన సాహిత్యం, శాసనాలు, ఆధునిక సాహిత్యం, కవితలు, కథలు, నవలలు, నాటికలు, బాలల పుస్తకాలు, జీవిత చరిత్రలు వంటి ఎన్నో నాటకాలు, ఎన్నెన్నో పుస్తకాలు లైబ్రరీలో ఉన్నాయి. ఈ సాహితీ సంపద భావి పరిశోధకులు, ఔత్సాహిక విద్యార్థులు, రచయితలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఈ గ్రంథాలయాన్ని ప్రతిరోజూ సాహిత్య అభిమానులు, సాహిత్య పరిశోధకులు, కవులు, కవిత్వం నేర్చుకోవాలనుకునే యువతరం సందర్శించి వారి సాహిత్య దాహార్తిని తీర్చుకుంటున్నారు. తెలుగు పరిశోధకులు తెలంగాణ విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, సెంట్రల్ యూనివర్సిటీ, శాతవాహన విశ్వవిద్యాలయం నుంచి వచ్చే విద్యార్థులు తమకు కావాల్సిన సాహిత్య సమాచారాన్ని పొందుతున్నారు. నరేశ్‌రావు ఏర్పాటు చేసిన గ్రంథాలయంలోని పుస్తకాల సహకారంతో ఇప్పటివరకు ఆరుగురు విద్యార్థులు తమ పరిశోధక వ్యాసాలను పూర్తిచేశారు.

35 ఏళ్లుగా..

జిల్లా కేంద్రంలోని సీతారాంనగర్ కాలనీలో నివాసముండే డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు సిర్పూర్ జెడ్పీహెచ్ఎస్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కవితలు, కథలు, వ్యాసరచనల్లో తర్ఫీదునిస్తున్నారు. గుండారం గువ్వలు, సిరిపురం సిరులు వంటి పుస్తకాలు ప్రచురించారు. ఆయన విద్యార్థులు రాసిన కవితలకు జాతీయ బహుమతులు దక్కాయి. 35 ఏళ్ల క్రితం నుంచి పుస్తకాలు సేకరించే పనిలో పడిన నరేశ్‌రావు.. ఇప్పటివరకు దాదాపు 15 వేలకు పైగా పుస్తకాలు సేకరించారు. తెలుగు సాహిత్యంలో విశేషమైన కీర్తిని గడించిన పుస్తకాలు ఆయన లైబ్రరీలో కొలువుదీరి ఉన్నాయి.

రాష్ట్ర గ్రంథాలయ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ బాల శ్రీనివాసమూర్తి, డాక్టర్ త్రివేణి, డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్ మేకల రామస్వామి, బోయిన్‌పల్లి ప్రభాకర్, కవులు వీపీ చందన్‌రావు, పంచరెడ్డి లక్ష్మణ్, ఘనపురం దేవేందర్, గంట్యాల ప్రసాద్, డాక్టర్ శారద హన్మాండ్లు, చింతల శ్రీనివాస్‌గుప్తా గ్రంథాలయాన్ని సందర్శించారు. డాక్టర్ వారె దస్తగిరి, డాక్టర్ శశికుమార్, డాక్టర్ సుంకరి గంగాధర్, డాక్టర్ అన్నం దాస్ జ్యోతి, డాక్టర్ ఎం రామస్వామి, కందకుర్తి ఆనంద్ సిద్దసాయిరెడ్డి తదితరులు తమ పరిశోధనలు పూర్తిచేశారు.





గురువు సినారె, ప్రముఖ కవి అందెశ్రీతో డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు



గ్రంథాలయంలో జిల్లాకు చెందిన ప్రముఖ కవులు

లైబ్రరీలోని సాహిత్య సంపద

ప్రబంధాలు

16వ శతాబ్దంలో వచ్చిన వసుచరిత్ర, మనుచరిత్ర, ఆముక్తమాల్యద, శ్రీకాళహస్తీశ్వర మహత్యం, పాండురంగ మహత్యం, రాజశేఖర చరిత, పారిజాతాపహరణం.

ఆధునిక సాహిత్యం

గురజాడ అప్పారావు తెలుగులో రచించిన మొదటి కథ దిద్దుబాటు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు, చాసోకథలు, విశ్వనాథ సత్యనారాయణ కథలు, అడవి బాపిరాజు కథలు, కేతు విశ్వనాథరెడ్డి, కాళీపట్నం రామారావు కథలు.. ఇంకా ఎన్నో..

పరిశోధన గ్రంథాలు

బీఎన్‌రెడ్డికి చెందిన తెలుగులో శాసననాలు, బిరుదరాజు రామరాజు తెలుగు జానపద గేయ సాహిత్యం, సినారె ఆధునిక కవిత్వం, సంప్రదాయాలు, ప్రయోగాలు, డాక్టర్ కొట్టూరు ముత్యం రచించిన శ్రీకాకుళ ఉద్యమంలో తెలుగు సాహిత్య ప్రభావం, నిజామాబాద్ జిల్లా శాస్త్రాలు, బాచన్‌పల్లి ఒక గుట్టకిందపల్లి వంటివి.

జీవిత చరిత్రలు

కందుకూరి వీరేశలింగం జీవిత చరిత్ర మొదలుకొని ఇటీవల వచ్చిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అమరేశ్వర రాజేశ్వర శర్మ, నేను చిందు ఎల్లమ్మను (జిల్లాకు చెందిన చిందు కళాకారిణి).

ఆత్మకథలు

మళ్లీ మొదలు, గుఱ్ఱం జాషువా, దాశరథి రంగాచార్య, దాశరథి కృష్ణమాచార్య ఆత్మకథలు శ్రీపాద సుబ్రహ్మణ్యం ఆత్మకథ, కాళోజీ ఆత్మకథ 'ఇది నాగొడవ', నేను చిందు ఎల్లమ్మను.

నవలలు

తెలుగులో కందుకూరి వీరేశలింగం రాసిన మొదటి సాంఘిక నవల రాజశేఖర చరిత్ర మొదలుకొని విశ్వనాథ సత్యనారాయణ నవలలు, గుడిపాటి వెంకటాచలం నవలలు, డాక్టర్ కేశవరెడ్డి నవలలు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు రచించిన వేయి పడగలు.

కవిత్వం

శ్రీశ్రీ మహాప్రస్థానం మొదలుకొని దేవరకొండ బాలగంగాధర్ తిలక్ రాసిన అమృతం కురిసిన రాత్రి, గుంటూరు శేషేంద్ర శర్మ (ఆధునిక మహాభారతం), సినారే రచించిన విశ్వంభర, శివారెడ్డి కవిత్వం తదితరాలు.

చరిత్ర పుస్తకాలు

తెలంగాణ చరిత్ర, తెలంగాణ సాహిత్య చరిత్ర, తెలుగు సాహిత్య చరిత్ర, సంస్కృత సాహిత్య చరిత్ర, సూర్యరాయాంధ్ర నిఘంటువులు (14 సంపుటాలు), వ్యాకరణశాస్త్ర గ్రంథాలు తదితరాలున్నాయి.

జిల్లాకు చెందిన సమగ్ర సాహిత్యం నిజామాబాద్ జిల్లా సంపూర్ణసాహిత్య పుస్తకాలు.

ప్రత్యేక సంచికలు (సావనీర్‌లు)

ఇందూరు ఉత్సవాలు, ప్రపంచ తెలుగు మహాసభలు, శతాబ్ది ఉత్సవాలు, దశాబ్ది ఉత్సవాలు, తదితర ప్రత్యేక సంచికలు.

కాంగ్రెస్ శ్రేణుల్లో అసహనం

- స్థానిక ఎన్నికలు నిర్వహించకపోవడంతో నీరుగారుతున్న ఉత్సాహం
- నామినేటెడ్ పదవులు రాక గుర్రుమంటున్న సీనియర్లు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమితో మరింత నిస్తేజం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అధికార కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో రోజురోజుకూ అసహనం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో అధికారం దక్కించుకుని 16 నెలలు పూర్తవుతున్నప్పటికీ తమకు ప్రాధాన్యత దక్కడం లేదని జిల్లాకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు తమకు అన్యాయం జరుగుతోందని గుర్రుగా ఉన్నారు. పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి అనేక ఇబ్బందులు పడుతూ పార్టీ కోసం పనిచేసినప్పటికీ తమకు తగిన ప్రాధాన్యం దక్కడంలేదని అత్యధిక మంది కార్యకర్తలు బహిరంగంగానే అసంతృప్తి వెలిబుచ్చుతున్నారు. పైగా బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో విచ్చలవిడిగా వ్యవహరించిన వాళ్లను అధికారం వచ్చాక కాంగ్రెస్‌లోకి తీసుకోవడమే కాకుండా, వాళ్లకే ప్రాధాన్యత ఇచ్చి తమకు మాత్రం ఇవ్వడంలేదని అంటున్నారు. అధికారులు సైతం బీఆర్ఎస్ నుంచి వచ్చిన వాళ్లకే ప్రాధాన్యత ఇస్తూ తమకు సహకరించడంలేదని ఆగ్రహంగా ఉన్నారు. మరోవైపు కొందరికే నామినేటెడ్ పదవులు ఇచ్చి తమకు ఇవ్వకుండా మానసిక వేదనకు గురిచేస్తున్నారని పార్టీలో ఏళ్లతరబడి పనిచేస్తున్న సీనియర్లు వాపోతున్నారు. బాల్కొండ నియోజకవర్గం నుంచే ముగ్గురికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు, బీఆర్ఎస్ నుంచి వచ్చిన మరొకరికి డీసీసీబీ చైర్మన్ పదవి ఇవ్వడం పట్ల కూడా సీనియర్లు అసహనంగా ఉన్నారు.

సీఎం ప్రచారం చేసినా..

నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎన్నికల్లో ముఖ్యమంత్రి వచ్చి ప్రచారం చేసినప్పటికీ సిట్టింగ్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కోల్పోయింది. మరోవైపు ఉత్తర తెలంగాణలో రోజురోజుకూ ప్రాబల్యాన్ని పెంచుకుంటున్న బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతో పాటు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాన్ని సైతం గెలుచుకుంది. జిల్లాలో మున్సిపాలిటీలు, పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుచుకునేందుకు బీజేపీ నాయకత్వం పకడ్బందీగా పావులు కదుపుతోంది. తాజా ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండుకు రెండు స్థానాలను గెలుపొందిన బీజేపీ రెట్టించిన ఉత్సాహంతో ముందుకెళుతోంది. ఓటమి భారంతో కాంగ్రెస్‌లో నిరుత్సాహం నెలకొంది.

అనవసర జాప్యం..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే గ్రామ పంచాయతీల పదవీ కాలం పూర్తయింది. తరువాత మండల, జిల్లా ప్రజా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం, మూడు నెలల క్రితం మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగిసిపోయింది. అయితే సహకార సంఘాలకు ఆరు నెలల పాటు పదవీకాలం పొడిగించారు. ప్రభుత్వం పట్ల అంతగా వ్యతిరేకత రాకముందే పాలకవర్గాల కాలపరిమితి పూర్తయిన స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తే సానుకూల ఫలితాలు సాధించే అవకాశాలు ఉండేవన్నారు. అనవసర తాత్సారం చేసి వ్యతిరేక పవనాలు వచ్చేవరకు చేశారని, దీంతో ఉత్సాహం నీరుగారిపోతోందని పార్టీ శ్రేణులు అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా బాధ్యతలన్నీ అధికారులకు అప్పగించడంతో తమకు విలువ లేకుండా పోతోందని ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు అంటున్నారు.

సుదర్శన్‌రెడ్డి వల్లే నవోదయ రిజెక్టు

- ఎన్‌ఎస్‌ఎఫ్ భూమి ఎలా ప్రతిపాదిస్తారు ?
- ఎంపీ అర్వింద్ ధర్మపురి



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: నవోదయకు నిజాంషుగర్స్ ఫ్యాక్టరీకి చెందిన 8 ఎకరాల భూమిని ప్రతిపాదించడంతో రిజెక్ట్ అయ్యిందని, విద్యాలయ ఏర్పాటు ప్రక్రియ ఆరు నెలలు వెనుకబడిందని ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. నిజామాబాద్ నగరంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఎంపీ విలేకరులతో మాట్లాడారు. నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు అనువుగా ఉంటుందని కలిగోట్ శివారును నవోదయ విద్యాలయానికి ఎంపిక చేశామన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నవోదయకు స్థలాలను త్వరగా క్లియర్ చేయాలని కోరగా ఆయన అధికారులకు ఆదేశాలిచ్చారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే నియోజకవర్గంలో నవోదయ ఏర్పాటుకు తమ పార్టీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని ఒప్పిస్తే.. మరో కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని సుదర్శన్‌రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. సుమారు రూ.100 కోట్లతో చేపట్టే నవోదయకు నిజాంషుగర్స్‌కు చెందిన ప్రయివేటు భూమిని ఎలా ప్రతిపాదిస్తారని నిలదీశారు. కాబోయే మంత్రికి ఉండాల్సిన ఏ ఒక్క లక్షణం సుదర్శన్‌రెడ్డికి లేదన్నారు. ఎన్‌ఎస్‌ఎఫ్‌ని తెరిపించే ఉద్దేశం సుదర్శన్‌రెడ్డికి లేదా అని అన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ పెట్టుకునే ఆలోచనలో ఆయన ఉన్నారని, ఇంకా నిజాంషుగర్స్‌ను ఏం తెరిపిస్తారని ఆరోపించారు. దీనిపై రైతు సంఘాలు ఆలోచన చేసి భవిష్యత్ కార్యాచరణకు సిద్ధం కావాలన్నారు. ఇదిలా ఉండగా జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు ఓఎల్‌ఎస్ సర్వే చేసి పంపిస్తే పనులు ప్రారంభమవుతాయని అర్వింద్ సూచించారు. ఈ సర్వేకు, నవోదయ ఏర్పాటు కోసం స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాయాలన్నారు. రెండు పెద్ద ప్రాజెక్టులు ఆగిపోతే భూపతిరెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. నవోదయ రిజెక్ట్ విషయమై ఇప్పటికే సీఎంకు లేఖ రాశానని అర్వింద్ ప్రతిని విడుదలచేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్, నాయకులు మోహన్‌రెడ్డి, స్రవంతిరెడ్డి, కంచెట్టి గంగాధర్, నాగోళ్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకెళ్తున్నా..

పదేళ్లల్లో పది ఫ్లై ఓవర్లు కట్టాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నానని అర్వింద్ పేర్కొన్నారు. ఈనెలాఖరుకు మామిడిపల్లి, అడవి మామిడిపల్లి ఫ్లై ఓవర్లను ప్రారంభిస్తామని, ఈ ఏడాది ఆఖరు వరకు మాధవనగర్, అర్సపల్లి ఫ్లై ఓవర్ల పనులు పూర్తవుతాయన్నారు. బీజేపీకి రెండు ఎమ్మెల్సీలు దక్కడం కార్యకర్తల విజయమని, స్థానిక ఎన్నికల్లోనూ మెజార్టీ స్థానాలు గెలుస్తామన్నారు. జిల్లా కేంద్రంలో ఎంఐ ఎం వర్సెస్ బీజేపీ ఉంటుందన్నారు. జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ స్థానాలు చేస్తే తప్పేందని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధామిచ్చారు.



నగరంలో మున్నూరు కాపు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహిళలకు సన్మానం

ఘనంగా మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు.

దివ్యాంగులకు భత్యం మంజూరు

ఆర్మూర్: దివ్యాంగ విద్యార్థులకు అర్హతను బట్టి అలవెన్స్ (భత్యం)ను మంజూరు చేస్తూ సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్‌పీడీ) వెంకటనరసింహారెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగులకు ఎనిమిది నెలలకు సంబంధించి మొత్తం రూ.24,34,820 మంజూరయ్యాయి. విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి.

జిల్లాకు మంజూరైన నిధులు

223 మంది విద్యార్థులకు ట్రావెలింగ్ అలవెన్స్ నెలకు రూ.500ల చొప్పున ఎనిమిది నెలలకు గాను రూ.8 లక్షల 90 వేల 500 మంజూరయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలకు తల్లిదండ్రుల సహకారంతో వచ్చే 83 మంది దివ్యాంగ విద్యార్థులకు ఎస్కార్ట్ అలవెన్స్ నెలకు రూ.500ల చొప్పున రూ.3 లక్షల 29 వేల 500, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న దివ్యాంగులైన బాలికలు 691 మందికి స్టైఫండ్ నెలకు రూ.200ల చొప్పున రూ.11 లక్షల 4 వేలు మంజూరయ్యాయి. అదేవిధంగా దృష్టి లోపంతో బాధపడుతున్న 229 మంది దివ్యాంగులకు రీడర్ అలవెన్స్ నెలకు రూ.60 చొప్పున రూ. ఒక లక్ష 9 వేల 920 మంజూరయ్యాయి.

క్లుప్తంగా

'ఆడిటర్లను విచారణకు పిలవండి'


విచారణ అధికారి మురళికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ డైరెక్టర్లు

వేల్పూర్: నిధుల అవకతవకలపై పదేళ్ల నుంచి ఆడిట్ నిర్వహించిన ఆడిటర్లను విచారణకు పిలవాలని శనివారం విచారణకు వచ్చిన అధికారి మురళికి వేల్పూర్ మండలం పడగల్ సొసైటీ మాజీ డైరెక్టర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల కిందట సొసైటీలో నిధుల గోల్‌మాల్ జరిగిందని, దీనిపై సమాధానం చెప్పాలని తమను విచారణకు పిలవడం శోచనీయమన్నారు. ప్రతి సంవత్సరం ఆడిటర్లు నిధుల వినియోగంపై తనిఖీ చేసినప్పుడు అవకతవకలు కనిపించలేదా? అని ప్రశ్నించారు. వార్షిక ఆడిట్ చేసే ఆడిటర్లు సొసైటీలో జరిగే అవకతవకలపై అప్పుడే చెబితే ప్రశ్నించేవారమన్నారు. తమకు ఆడిట్ వివరాలు చెప్పకుండా ఆమోదింపజేసుకున్నారని విచారణ అధికారికి స్పష్టం చేశారు. తమ పదవీకాలంలో నిధులను తనిఖీ చేసిన ఆడిటర్లు, ఎన్‌డీసీసీ బ్యాంకు మేనేజర్లను విచారణకు పిలిచి, ఎక్కడ పొరపాటు జరిగిందో వెలికితీయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ డైరెక్టర్లు ఎడ్ల రాజేశ్వర్‌రెడ్డి, బ్యాగరి పుణ్యరాజ్, కొంతం దేవన్న, నేరేళ్ల రాజేశ్వర్‌రెడ్డి, బుట్టి మహిపాల్, ఏనుగు శేఖర్‌రెడ్డి ఉన్నారు.

వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తా

- ఎంపీ అర్వింద్


మాట్లాడుతున్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్

నిజామాబాద్ నాగారం: జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్స్ కోసం వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. నగరంలోని న్యూ అంబేడ్కర్ భవనంలో శనివారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్స్ వెల్ఫేర్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్స్ సంక్షేమం కోసం పాటు పడుతానని అన్నారు. కార్యక్రమంలో కమిటీ నేతలు అజీజ్, శ్రావణ్‌కుమార్, మల్లేశ్, సాయరెడ్డి, ఎవీఎల్ నారాయణ, గంగాధర్, జ్యోతిరాజ్, మోహన్‌దాస్, జిల్లా అధ్యక్షుడు పీపీ రెడ్డి, కార్యదర్శి షేక్ హుస్సేన్, కామారెడ్డి భిక్షపతి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

మోపాల్: మండలంలోని తాడెం శివారులో శుక్రవారం రాత్రి కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్‌కు చెందిన మురళీధర్ మోపాల్ నుంచి నిజామాబాద్ వైపు వస్తుండగా, ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో మురళీధర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

రాజీమార్గంలోనే సమస్యల పరిష్కారం

- జిల్లా జడ్జి, డీఎల్‌ఎస్‌ఏ చైర్‌పర్సన్ సునీత కుంచాల
- లోక్‌అదాలత్‌లో 18,252 కేసుల పరిష్కారం
- 300 బ్యాంక్ ఇన్సూరెన్స్ కేసుల్లో రూ.73 లక్షల రివార్డు


లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: భూతగాదాల కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల సూచించారు. జిల్లా కేంద్రంలోని డీఎల్‌ఎస్‌ఏ కార్యాలయంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూ పంచాయితీల కేసులు చాలా రోజుల వరకు పెండింగ్‌లో ఉంటున్నాయని, దీంతో ఇరు కుటుంబాల ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమవుతుందన్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుంటే ఇరువురికీ సమస్యలు తలెత్తవని తెలిపారు. ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాద కేసుల్లో ఇన్సూరెన్స్ కంపెనీలతో పరిష్కారానికి ముందుకొస్తే నెల రోజుల్లోనే చెక్కు రూపంలో నగదు వస్తుందని తెలిపారు. 42 సైబర్ క్రైమ్ కేసులను పరిష్కరించి వివిధ అకౌంట్లలో నిలిచిన నగదును బాధితులకు అందించినట్లు పేర్కొన్నారు.

నెల రోజుల్లో బదిలీ అవుతా..

జిల్లా జడ్జిగా మూడేళ్ల నుంచి పని చేస్తున్నానని, మరో నెల రోజుల్లో బదిలీ అవుతానని, ఈ లోక్ అదాలత్ చివరిదని జడ్జి సునీత కుంచాల అన్నారు. మూడేళ్లలో పోలీసులు, న్యాయవాదులు, వివిధ సంస్థలు, డిపార్ట్‌మెంట్‌ల సహకారం మరువలేనిదని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అంకిత్, డీసీపీ బస్వారెడ్డి, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి పద్మావతి, బార్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18,252 కేసుల పరిష్కారం

జిల్లాలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న 18,252 కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించినట్లు డీఎల్‌ఎస్‌ఏ సూపరింటెండెంట్ శైలజ తెలిపారు. 14 లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేయగా, కేసుల పరిష్కారంతో రివార్డు రూపంలో రూ.5.34 కోట్లు వచ్చినట్లు వెల్లడించారు. యాక్సిడెంట్, బ్యాంక్ రుణాలు, ఇన్సూరెన్స్‌లకు చెందిన 300 కేసుల్లో రాజీ కుదర్చగా, కక్షిదారులకు రూ.73 లక్షల రివార్డు వచ్చినట్లు పేర్కొన్నారు. గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన కేసుల కంటే 4,500పైగా ఎక్కువ కేసులు పరిష్కారమైనట్లు డీఎల్‌ఎస్‌ఏ వర్గాల ద్వారా తెలిసింది.

లయన్స్ కంటి ఆస్పత్రిలో 'ఆరోగ్య శ్రీ'

- సేవలు ప్రారంభించిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్


ఆరోగ్య శ్రీ సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ హనుమంతు

బోధన్: బోధన్ లయన్స్ కంటి ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆస్పత్రి వ్యవస్థాపకులు పోలవరపు బసవేశ్వర్‌రావు, చైర్మన్ నర్సింహారెడ్డితో కలిసి శనివారం ఆరోగ్య శ్రీ సేవలను ప్రారంభించారు. అధునాతన వైద్య పరికరాలతో ఏర్పాటు చేసిన ఐ స్క్రీనింగ్ టెస్ట్ మొబైల్ వ్యాన్‌ను పరిశీలించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగుల కోసం ఏర్పాటు చేసిన డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పాతికేళ్లుగా లయన్స్ కంటి ఆస్పత్రి ద్వారా నామమాత్రపు రుసుముతో ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పేద ప్రజలకు పూర్తిస్థాయిలో ఉచిత కంటి శస్త్రచికిత్సలు అందుబాటులోకి తెచ్చేందుకు లయన్స్ కంటి ఆస్పత్రికి రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం వర్తింపజేసినట్లు పేర్కొన్నారు. తెల్ల రేషన్‌కార్డు కలిగిన వారికి ద్వారా పైసా ఖర్చు లేకుండా కంటి శస్త్రచికిత్సలు చేస్తారని వివరించారు. ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ కంటి ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, తహసీల్దార్ విఠల్, ఏసీపీ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు కొడాలి కిశోర్, శ్రీనివాస్‌రావు, ఉమేశ్ షిండే తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల వీరగాథలను స్ఫూర్తిగా తీసుకోవాలి


విద్యార్థులతో ప్రొఫెసర్ రాజారామ్, అధ్యాపకుడు వాసం చంద్రశేఖర్, వారె దస్తగిరి, నర్సయ్య

- ఇఫ్లూ అసోసియేట్ ప్రొఫెసర్ రాజారామ్
- తెలంగాణ యూనివర్సిటీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు, యువత మహనీయుల వీరగాథలతో స్ఫూర్తి పొంది నవభారత నిర్మాణం చేయాలని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ) కమ్యూనికేషన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ కే రాజారామ్ పిలుపునిచ్చారు. అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్‌ఎస్‌ఎం) నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వర్సిటీలో రాణీ అహిల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాజారామ్ మాట్లాడుతూ... వ్యక్తిగత జీవితంలోని విషాదాలను అధిగమించి మూడు దశాబ్దాలపాటు మాల్వా రాజ్యంలో అహిల్యాబాయి పరిపాలన కొనసాగించారని తెలిపారు. యుద్ధరంగంలో ఆమె చూపిన తెగువ, పాలన సంస్కరణలు తెచ్చిన విధానం, సామాజిక సమరసత కోసం చేసిన కృషి, కాశీ విశ్వనాథ్, సోమనాథ్ ఆలయాల పునరుద్ధరణలో పోషించిన పాత్రను రాజారామ్ గుర్తు చేశారు. వర్సిటీ పూర్వ విద్యార్థి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వారె దస్తగిరి మాట్లాడుతూ యువత రాణి అహిల్యాబాయి జీవితగాథ స్ఫూర్తితో గొప్ప పనులు చేయడానికి పూనుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెయూ అధ్యాపకులు వాసం చంద్రశేఖర్, అకడమిక్ కన్సల్టెంట్ నర్సయ్య, తెయూ ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్మీడియట్ సంస్కృతం జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 10 నుంచి ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్కృతం బోధించే అధ్యాపకులు ఉదయం 9.30 గంటలకు జిల్లా ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో రిపోర్టు చేయాలని సూచించారు. మూల్యాంకనం చేసే అధ్యాపకులను ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశించారు. రిలీవ్ చేయని వారిపై ఇంటర్‌బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు ఆర్‌సీవో బషీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 8వ తరగతి వరకు, ఇంటర్ ప్రవేశాల కోసం ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9290909078, 8801425857 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

కుటుంబంలో తల్లిపాత్ర అనిర్వచనీయం


మహిళలను సన్మానించిన ఏసీపీ రాజావెంకటరెడ్డి, మాదాసు స్వామి యాదవ్

సుభాష్‌నగర్: కుటుంబంలో తల్లి పాత్ర అనిర్వచనీయమని, గృహిణి శ్రేయస్సే గృహం శ్రేయస్సని నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డి అన్నారు. జిల్లాలోనే మొట్టమొదటి మహిళా మున్సిపల్ కౌన్సిలర్ మాదాసు నాగమ్మ యాదవ్ స్మారకంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నగరంలోని ఎల్లమ్మగుట్ట మున్నూరుకాపు సంఘంలో శనివారం నిర్వహించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు రమాదేవి మాట్లాడుతూ.. స్త్రీ ఆధారంగానే సమాజం నిర్మాణమవుతుందని, కుటుంబం మంచిచెడులకు ఆధారం ఆ స్త్రీ నడవడి మాత్రమేనని, అందుకే స్త్రీలు తమ జీవితాన్ని ఉన్నతమైన మార్గం వైపు నడిపించాలని సూచించారు. తమ పిల్లల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దిన బీడీ కార్మికులు బెల్లాల్ సావిత్రి, బొబ్బిలి ఒడ్డెమ్మ, మున్సిపల్ కార్మికురాలు లావణ్య, డ్వాక్రా పొదుపు సంఘాల సభ్యురాలు వేముల శోభ, మున్సిపల్ ఆర్పీలు మీన, నిర్మల, నీరజ, సుజాత, ధారాబాయిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ వారే దస్తగిరి, కార్యక్రమ నిర్వాహకుడు మాదాసు స్వామియాదవ్, బీజేపీ నగర మాజీ అధ్యక్షుడు యెండల సుధాకర్, బీడీ కార్మికులు, పొదుపు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల కరెంటు షాక్‌తో ఇద్దరి మృతి

- కారకులపై చర్యలు తీసుకోవాలని కుటుంబికుల ఆందోళన


సయ్యద్ బాబా (ఫైల్)

బోధన్‌టౌన్(బోధన్): బట్టలు ఆరవేసేందుకు వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన బోధన్ పట్టణం రాకాసీపేట్ కాలనీలో శనివారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాకాసీపేట్‌కు చెందిన సయ్యద్ బాబా(53) శనివారం ఇంటిపై బట్టలు ఆరవేస్తుండగా అక్కడే ఏర్పాటు చేసిన డిష్ బాక్సు నుంచి విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తన తండ్రి మృతికి కారణమైన డిష్ యజమానిపై చర్యలు చేపట్టాలని మృతుడి కొడుకు సయ్యద్ అద్నాన్ ఫిర్యాదు చేశాడని సీఐ తెలిపారు. ఈ మేరకు డిష్ యజమాని జయదేవ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా, సయ్యద్ బాబా మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి బంధువులు, స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. కేబుల్ టీవీ డిష్ బాక్సు నుంచి విద్యుత్ సరఫరా అవుతోందని గతంలో చెప్పినా యజమాని పట్టించుకోలేదని, వారి నిర్లక్ష్యంతోనే ప్రాణం పోయిందని పేర్కొన్నారు. కారకులపై చర్యలు తీసుకుంటామని సీఐ సముదాయించడంతో ఆందోళనకారులు శాంతించారు.

సీతారాంపల్లిలో మహిళ ..

బీబీపేట: ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తగిలి మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని సీతారాంపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జాలిగామ రాధిక (28) భర్త రాజనర్సు మూడు నెలల క్రితం టీవీఎస్ చాంప్ వాహనాన్ని కొనుగోలు చేశాడు. వాహనాన్ని రాత్రి ఇంటి బయట ఉంచడంతో గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్‌ను దొంగిలిస్తున్నారు. దీంతో ఆయన వాహనానికి విద్యుత్ వైర్‌ను అమర్చి ఉంచాడు. వైర్‌ను తీయకుండా అలాగే ఉంచగా శనివారం మధ్యాహ్నం అనుకోకుండా రాధిక బండిని ముట్టుకుంది. వెంటనే విద్యుత్ షాక్ తగలడంతో కింద పడగా, చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే రాధిక మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి తొమ్మిది నెలల పాప ఉంది. మృతురాలి తల్లి శ్యామల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


రాధిక మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దొంగల ముఠా అరెస్టు

- రూ.10.17 లక్షల నగదు స్వాధీనం
- పీడీ యాక్ట్ నమోదుకు సిఫారసు
- ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజావెంకటరెడ్డి

ఖలీల్‌వాడి: ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో చోరీకి పాల్పడిన దొంగల ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ రాజావెంకటరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీపీ వివరాలు వెల్లడించారు. నాగారం ప్రాంతానికి చెందిన షేక్ సాదక్, సురేకర్ ప్రకాశ్, సయ్యద్ షాదుల్లా, సాయినాథ్ విఠల్‌రావులు ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడినట్లు చెప్పారు. ఈ ముఠా సభ్యులు గతంలో చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లి ఇటీవలే విడుదలైనట్లు తెలిపారు. ఈ నెల 5న అర్ధరాత్రి నలుగురు ముఠా సభ్యులు నాందేవ్‌వాడలోని సాయి బాలాజీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో చొరబడి కౌంటర్‌లో దాచిన రూ.10.27లక్షలను అపహరించారని పేర్కొన్నారు. ట్రాన్స్‌పోర్టు యజమాని నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దుండగుల కోసం గాలింపు చేపట్టామన్నారు. శనివారం ఉదయం బైపాస్ రోడ్‌లో వాహనాల తనిఖీ చేపడుతుండగా అనుమానంగా సంచరిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా, చోరీకి పాల్పడినట్లు అంగీకరించారని ఏసీపీ వెల్లడించారు. చోరీ జరిగిన 48 గంటల్లోనే సీసీఎస్ సీఐ సురేశ్, టౌన్ సీఐ శ్రీనివాస రాజు, త్రీటౌన్ ఎస్సై హరిబాబు ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేసి దొంగలను పట్టుకున్నట్లు వివరించారు. కాగా, అపహరించిన సొత్తులో నుంచి రూ.10వేలను నిందితులు జల్సాలకు వినియోగించగా, మిగతా రూ.10.17లక్షల నగదు, ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాపై పీడీయాక్టు నమోదు కోసం ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తున్నట్లు తెలిపారు. చోరీ కేసు చాకచక్యంగా ఛేదించిన సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

అంతర్రాష్ట్ర చైన్‌స్నాచర్లు..

ఖలీల్‌వాడి: నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో చైన్‌స్నాచింగ్, బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గతేడాది డిసెంబర్ 12న బోర్గాం(పి)కి చెందిన దుమాల లక్ష్మీబాయి ఒంటరిగా నడుచుకుంటూ వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడినట్లు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నాల్గో టౌన్ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలోని బృందం నిందితుల కోసం గాలింపు చేపట్టిందన్నారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన షేక్ ఇమాన్ అలియాస్ అబ్బు, షేక్ అర్బాజ్ అలియాస్ మాయా నిర్మల్ జిల్లా బాసరలోని శారదానగర్‌లో నివసిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. సాంకేతిక సహాయంతో నిందితులను పట్టుకొని వారి నుంచి మూడు గొలుసులు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితులపై నాల్గో టౌన్ పీఎస్, మాక్లూర్, నిర్మల్ జిల్లా బాసరలో చైన్ స్నాచింగ్‌లు, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో బైక్‌ల చోరీ కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇదిలా ఉండగా నాందేడ్ జిల్లాకు చెందిన మరో నిందితుడు అమన్ అలియాస్ అమన్‌పటేల్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ చెప్పారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య


సురేశ్ (ఫైల్)

ఎడపల్లి (బోధన్): ఎడపల్లి మండలం ఠాణా కలాన్ గ్రామానికి చెందిన సురేశ్(24) శుక్రవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వంశీ చందర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం.. కుటుంబ కలహాల నేపథ్యంలో సురేశ్ శుక్రవారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం మృతదేహం నీటిపై తేలడంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జీవితం మీద విరక్తితో..


చిన్న సాయిలు మృతదేహం

పిట్లం(జుక్కల్): మండలంలోని బొల్లక్‌పల్లి గ్రామ శివారులోని మంజీరా నదిలో శనివారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజు తెలిపారు. రుద్రూర్ గ్రామానికి చెందిన జిల్లాపురం చిన్న సాయిలు(48) కొంతకాలం నుంచి మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతుండేవాడు. జీవితంపై విరక్తితో బొల్లక్‌పల్లి గ్రామశివారులోని మంజీర బ్రిడ్జిపై నుంచి నీటిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చేపలవేటకు వెళ్లి యువకుడి మృతి


ఉస్మాన్ (ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని మంజీరా నదిలో చేపలవేటకు వెళ్లి చీనూర్ గ్రామానికి చెందిన మహ్మద్ ఉస్మాన్(27) మృతి చెందాడు. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని మంజీరా నదిలో చేపల వేటకు ఉస్మాన్ శుక్రవారం వెళ్లాడు. రాత్రి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. శనివారం నది ఒడ్డున ఉస్మాన్‌కు సంబంధించిన వస్తువులు కనిపించడంతో కుటుంబసభ్యులు నీటిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య అమీదాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..


సాయికృష్ణ(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలం తాండూర్ గ్రామానికి చెందిన అచ్చనపల్లి సాయికృష్ణ(21) హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. డబ్బుల విషయంలో తల్లి సాయమ్మ మందలించిందనే కారణంతో సాయికృష్ణ గత నెల 21న ఇంట్లో ఉన్న పురుగుల మందు సేవించి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమచికిత్స అనంతరం ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచనల మేరకు గురువారం సాయికృష్ణను గాంధీ ఆస్పత్రికి తరలించగా సాయంత్రం తుదిశ్వాస విడిచాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

మూడేళ్లుగా చోరీలు..


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు
- దాదాపు 40 కేసుల్లో నిందితులు

కామారెడ్డి క్రైం: మహారాష్ట్రకు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ఇద్దరు నిందితులను పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ముఠాలో ఉన్న మరికొందరు వ్యక్తులు, చేసిన నేరాలు, సొత్తు రికవరీ అంశాలపై తదుపరి విచారణ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ చంద్రశేఖర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. శనివారం ఉదయం పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. మూడు సంవత్సరాలుగా జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా సభ్యులుగా వెల్లడైంది. నిందితులను మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నర్సి పట్టణానికి చెందిన శేఖ్ ఇమ్రాన్ ఇస్మాయిల్, షేక్ వాజీద్‌గా గుర్తించారు. మరికొందరితో కలిసి ముఠాగా ఏర్పడిన వీరు కామారెడ్డి ప్రాంతంలో దాదాపు 40 ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు నేరం అంగీకరించారని సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ ఉస్మాన్, కానిస్టేబుళ్లు రవి, సురేందర్, గణపతి, శ్రావణ్, రాజేందర్, కిషన్‌లను అభినందించారు.

అమ్రాద్‌తండాలో ముగ్గురికి కత్తిపోట్లు

- ఇద్దరి పరిస్థితి విషమం
- పరారీలో నిందితులు


కత్తిపోట్లకు గురైన మాలోత్ రాజునాయక్, శ్రీనివాస్ నాయక్, జ్యోతిరామ్ నాయక్

మాక్లూర్: రేషన్ దుకాణం వద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురు వ్యక్తులు కత్తిపోట్లకు గురైన ఘటన మాక్లూర్ మండలం అమ్రాద్‌తండాలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేషన్‌డీలర్ మాలోత్ సుజాత శనివారం ఉదయం బియ్యం పంపిణీ చేస్తోంది. భుక్య రమేశ్ అలియాస్ విక్రమ్ తనకు రావాల్సిన బియ్యం తీసుకొని అదనంగా మరో 50 కిలోల బియ్యం ఇవ్వాలని డీలర్‌పై ఒత్తిడి తెచ్చాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా, అంతలోనే డీలర్ భర్త జ్యోతిరామ్‌నాయక్, అతని సోదరులు శ్రీనివాస్ నాయక్, రాజునాయక్ రేషన్ దుకాణం వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకునేలోపే రమేశ్, అతని సోదరుడు భుక్య పీర్‌సింగ్ కలిసి ముగ్గురిపై కత్తితో దాడి చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై రాజశేఖర్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ నాయక్, రాజునాయక్‌ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. రేషన్‌డీలర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. కాగా, నిందితులిద్దరూ పరారీలో ఉన్నారని ఎస్సై తెలిపారు.

అల్ప్రాజోలం పట్టివేత

- ముగ్గురి రిమాండ్


నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

కామారెడ్డి క్రైం: కల్తీకల్లులో కలిపే నిషేధిత మత్తు పదార్థాన్ని సరఫరా చేస్తున్న ముగ్గురిని కామారెడ్డి ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన దాసోజు మధుసూదనచారి, నాగిరెడ్డిపేట మండలం అక్కంపల్లికి చెందిన భూమా విఠల్‌గౌడ్, గుండారం వెంకటి గౌడ్‌లను శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రానికి సమీపంలో అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద నుంచి 250 గ్రాముల అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు. మత్తుమందును సదాశివనగర్ మండలం భూంపల్లికి చెందిన గడిపల్లి సురేశ్‌గౌడ్ వద్ద కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. కాగా, సురేశ్ గౌడ్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.